క్లుప్తంగా

ధర్మాన్ని రక్షించేది మాతృమూర్తులే..



సమావేశంలో మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

పిఠాపురం: ధర్మాన్ని రక్షించేది మాతృమూర్తులేనని సమరసత సేవా ఫౌండేషన్ ఆంధ్ర ప్రాంత సహ సంయోజకులు ఈశ్వరయ్య అన్నారు. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా మహిళా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అమ్మఒడి, గుడి, బడి సక్రమంగా ఉంటే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు రక్షింపబడతాయన్నారు. కార్యక్రమంలో గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, మహిళా కన్వీనర్ గంధం వెంకటలక్ష్మి, సహ కన్వీనర్ వాసంశెట్టి సూర్యావతి, వరహాలబాబు, కంబాల నారాయణరావు, కట్టా బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వర స్వామివారు

సామర్లకోట: భక్త సందోహంతో పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయం సోమవారం కిటకిటలాడింది. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజామున స్వామివారికి జరిగే తొలి అభిషేకం, తొలి పూజలను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. ఈఓ డి నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు తెల్లవారుజామున పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి, అమ్మవారికి ఆలయంలోని ఉపాలయాలు, మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం సాయంత్రం స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దేవస్థానంలోని అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, సన్నిది రాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఇంటింటికీ అక్షతల పంపిణీ

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలోని కరణంగారితోట, కొత్తపేట, కనకదుర్గ గుడి, పాపయ్య చావిడి తదతర ప్రాంతాల్లో గొల్లప్రోలు హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో అయోధ్య రాముని అక్షతలు, రామ మందిర ఫొటోలను రామభక్తులు సోమవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

సామర్లకోట: నాటు సారా విక్రయాలు చేస్తున్న స్థావరాలపై కాకినాడ డీటీఎఫ్ అధికారుల బృందం సోమవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో సామర్లకోటకు చెందిన ఇద్దరు సారా వ్యాపారస్తులను అరెస్టు చేశారు. సామర్లకోట పట్టణంలో నాటు సారా అమ్మకాల జోరు పెరిగిందనే ఫిర్యాదుల మేరకు కాకినాడ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు చేసి స్థానిక శెట్టిబలిజపేటకు చెందిన గుబ్బల నాగమణిని 20 లీటర్ల సారాతోను, గుబ్బల వీర ఆదివిష్ణును 10 లీటర్ల సారాతోను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే నాగమణి భర్త సారా కేసులో ఉండి, ఏడాది పాటు జైలుశిక్ష అనుభవిస్తున్నాడని తెలిపారు. అదేవిధంగా వీర ఆదివిష్ణు తల్లిదండ్రులు కూడా సారా కేసుల్లో పాత ముద్దాయిలుగా ఉన్నారన్నారు. అనేక పర్యాయాలు హెచ్చరికలు జారీ చేసినా సారా విక్రయాలు మానడం లేదన్నారు. ముద్దాయిలను తదుపరి చర్యల కోసం ఎస్పీ వద్ద హాజరు పర్చనున్నట్టు ఆయన తెలిపారు. ఈ మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేశామని చెప్పారు.

కొండపోడు భూముల కోసం గిరిజనుల ధర్నా

పెద్దాపురం: సాగు చేస్తున్న తమకు కొండపోడు భూముల పట్టాలివ్వాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ వినోద్‌మిశ్రా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోసిరెడ్డి గణేష్ మాట్లాడుతూ ఏలేశ్వరం మండలం పరిమితడక, జె.అన్నవరం గ్రామాల గిరిజనులు సాగు చేసుకుంటున్న ఆర్ఓఎఫ్ఆర్ కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చెయ్యాలన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఆయా గ్రామాల ప్రజలకు రెండు డివిజన్ కేంద్రాలు ఏర్పడడంతో, అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు చోట్లా ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం ఉండడం లేదన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని గిరిజనులకు కొండపోడు భూముల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగులాపల్లి అర్జునుడు, బలుపు రమణ, కొమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పందేలకు రెడీ

- బరులు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- కోడి పుంజులకు పెరిగిన డిమాండ్
- గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి



కోడి పందేలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

కొత్తపల్లి: గ్రామాల్లో తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి సందడి నెలకొంది. ప్రతీఒక్కరూ తమ ఇళ్లకు రంగులు వేయించి శుభ్రం చేసుకుంటున్నారు. పండగ పనుల్లో మహిళలు తీరిక లేకుండా ఉన్నారు. పండగ దగ్గర పడడంతో కోడి పందేలు నిర్వహించేందుకు పందెంరాయుళ్లు సిద్ధమవుతున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో కోడి పందేలు నిర్వహించేందుకు బరులను సిద్ధం చేస్తున్నారు. పందేలకు అవసరమైన కోడి పుంజులకు తర్ఫీదు ఇస్తున్నారు.

పుంజులకు గిరాకీ

సంక్రాంతి పండగ నేపథ్యంలో కోడి పుంజులకు భారీగా డిమాండ్ పెరిగింది. జాతి రకం, రంగును బట్టి పుంజు రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకూ ధర పలుకుతోంది. పందెం కోడి పుంజులకు రారాజుగా చెప్పుకునే నల్ల చెవళకు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకూ డిమాండ్ ఉంది. కాకి నెమలి, ఎర్ర నెమలి, కాకి డేగ, పచ్చకాకి డేగ, డేగ, పంగిళి చవళతో పాటు పలు రకాలున్నాయి. పుంజు రకం, బరువు ఆధారంగా ధరలను నిర్ణయిస్తున్నారు.



పందేలకు సిద్ధం చేసిన కోడిపుంజులు

కోస మాంసానికి డిమాండ్

సంక్రాంతి వచ్చిందంటే చాలు కోస మాంసానికి డిమాండ్ పెరుగుతోంది. నాలుగైదేళ్ల కిందట మూడు కిలోల కోస మాంసం రూ.1,000 నుంచి రూ.2,000 వరకూ ఉండేది. కోసమాంసం రుచి చూసినవారు వాటి కోసం ఎగబడుతున్నారు. అదే సమయంలో పందెంరాయుళ్ల అధికారులు, అభిమానులు, బంధువులకు కోస మాంసాన్ని ఇవ్వడంతో మరింత డిమాండ్ పెరిగింది. గతేడాది ఒక్కొక్క కోసను రూ.4,000 నుంచి 6,000 వేలకు విక్రయించారు. ఈ సంవత్సరం ఆ ధర మరింత పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నిబంధనలను అతిక్రమించి సంక్రాంతి పండగలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పందేలు, జూదాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. జిల్లా ఎస్పీ ఆదేశాలతో పలు ప్రాంతాల్లో నిఘా పెంచాం. ప్రతీ ఒక్కరూ సంక్రాంతిని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలి.
– స్వామినాయుడు, ఎస్సై, కొత్తపల్లి

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సామర్లకోటలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛను లబ్ధిదారులు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు, వృద్ధులు సోమవారం సాయంత్రం క్షీరాభిషేకం చేశారు. స్థానిక 31వ వార్డులో వృద్ధులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర కార్మిక సంఘ నాయకుడు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పింఛను లబ్ధిదారులు మాట్లాడుతూ పింఛను రూ.మూడు వేలకు పెంచుతానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేశారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య కేక్ కట్ చేసి, ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మంచి చేస్తున్న సీఎం జగన్‌ను ఆదరించాలి



మూలపేటలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: సంక్షేమ పథకాల ద్వారా అన్నివర్గాలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా ఆదరించాలని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని మూలపేటలో సోమవారం కొత్త పింఛన్లు మంజూరుచేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ నిరుపేదలు ఆర్థికంగా ఎదిగేందుకు, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు నిండు మనసుతో దీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, సర్పంచ్ కంబాల మౌనిక, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీడీఓ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్ వచ్చే.. ఆనందం తెచ్చే..

కొత్తపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపు కానుకలో భాగంగా అర్హులందరికీ రూ.3 వేలు పింఛనుగా అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెంచిన పింఛన్ల పంపిణీతో ఊరూరా పండగ వాతావరణం ఏర్పడింది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అరకొరగా ఇచ్చిన పింఛన్ కోసం ఆత్మాభిమానాన్ని చంపుకుని జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడే వారమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి నేడు పింఛన్లు పెంచడమే కాదు ప్రభుత్వ లబ్ధిని ఇంటి ముంగిటకే పంపిస్తున్నారని లబ్ధిదారులు తమ సంతోషాన్ని పంచుకుంటున్నారు.



మూలపేటలో వృద్ధుడు పిల్లి సూర్యారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ విజయ



లబ్ధిదారుడు లోవరాజుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ జయబాబు

వృద్ధులకు కొత్త పింఛన్ల అందజేత

సామర్లకోట: కొత్త సంవత్సరంలో నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం లబ్ధిదారులకు ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు పంపిణీ చేశారు. స్థానిక ఏడో సచివాలయం పరిధిలో 23 కొత్త పింఛన్లు మంజూరు కాగా, 13వ వార్డు కౌన్సిలరు నేతల హరిబాబు వాటిని అందజేశారు. పింఛను అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సామర్లకోట ఏడో సచివాలయంలో కొత్త పింఛను అందజేస్తున్న కౌన్సిలర్ హరిబాబు

రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్షలు

సామర్లకోట: నూతన పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారం రైల్వే స్టేషన్ ఎదురుగా నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రవికుమార్, ఎం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉద్యోగులు, కార్మికులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలకు రైల్వే ఉద్యోగులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు సంఘీభావం తెలిపారు. మూడు రోజుల పాటు రిలే దీక్షలు కొనసాగుతాయని యూనియన్ నేతలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు హెచ్చరించారు.



దీక్షా శిబిరాన్ని సందర్శించిన జీఆర్పీ సీఐ, సిబ్బంది

నిరాహార దీక్షల్లో సీహెచ్ రాంబాబు, ఏవీవీ సత్యనారాయణ, కేవీ సత్యనారాయణ, ఎల్ వరహాలబాబు, కె శ్రీనివాసులు పాల్గొన్నారు. కాకినాడ జీఆర్పీ సీఐ గౌస్ సోమవారం సాయంత్రం దీక్షా శిబిరాన్ని సందర్శించి, రైల్వే కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు 15 అర్జీలు

పెద్దాపురం: ప్రతి వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం వివిధ మండలాల నుంచి 15 అర్జీలు అందినట్టు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సీహెచ్ వెంకటలక్ష్మి తెలిపారు. భూ సర్వే చేయించి, తమకు న్యాయం చేయాలని, స్థల ఆక్రమణ ఖాళీ చేయించాలని, తొలగించిన విద్యుత్ మీటర్‌ను పునరుద్ధరించాలని తదితర సమస్యలపై ఎనిమిది అర్జీలు అందినట్టు వెల్లడించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి, సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రతి అర్జీని పరిష్కరించాల్సిన బాధ్యత సంబంధిత శాఖాధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఎల్‌పీఓ బాలామణి, ఏడీఏ దైవకుమార్, రవిశంకర్, ప్రసాద్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న ఏఓ వెంకటలక్ష్మి

ఇంటింటికీ రక్షిత తాగునీరు

ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కొత్తపల్లి: ఇంటింటికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంకులు, తాగునీటి పైపులైన్ల పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. మూలపేటలో రూ.56.90 లక్షలు, కొత్తమూలపేటలో రూ.80 లక్షలు, రమణక్కపేటలో రూ.1.45 కోట్లు, శ్రీరాంపురంలో రూ.70 లక్షలు, ముమ్మిడివారిపోడులో రూ.46.90 లక్షలతో నిర్మించనున్న పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, సర్పంచులు కంబాల మౌనిక, నక్కా మణికంఠబాబు, పులి జయబాబు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకు పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ గీత, ఎమ్మెల్యే దొరబాబు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండపాటి లోవతల్లి, పీఎంసీ చైర్మన్ వి.రాంబాబు, వైస్ చైర్మన్ ఎం.శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యలో విప్లవాత్మక మార్పు

కొత్తపల్లి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యలో విప్లవాత్మకమైన మార్పును తీసుకొచ్చారని సర్పంచ్ వడిశెట్టి గౌరీరాజేశ్వరి అన్నారు. మండలంలోని నాగులాపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు విద్యా భారతి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న సర్పంచ్ గౌరీరాజేశ్వరి తదితరులు

స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. సోమవారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవిందు, అరుణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

పెద్దాపురం: ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ కంటే పరిమళ అధ్యక్షతన జరిగిన సభలో వీర్రాఘవరావు మాట్లాడారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. మారుతున్న ఆధునిక సాంకేతికతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గిరి, సంధ్యారాణి, జానకిరామయ్య, చిన్నారావు, గంగాధర్, దొరబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



వడ్లమూరులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న వీర్రాఘవరావు

‘ఆడుదాం ఆంధ్రా’లో భాగస్వాములు కావాలి

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు అన్నారు. ఈ క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రిని సోమవారం ఆయన గ్రామానికి చెందిన క్రీడాకారులకు కార్యక్రమానికి సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరిలో దాగున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామీణ యువత క్రీడల్లో ప్రతిభ కనపర్చి, రాష్ట్ర స్థాయిలో పెద్దాపురం నియోజకవర్గానికి గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, దేవస్థానం చైర్మన్ గవరసాని వీరాస్వామి, లక్కాకుల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి బషీర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో క్రీడా సామగ్రిని అందజేస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించండి

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దాపురం ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్ అన్నారు. క్రీడలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సచివాలయ స్థాయిలో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు.

10 నుంచి మండల స్థాయిలో..

సామర్లకోట: మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఈ నెల 10 నుంచి ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత తెలిపారు. మండలంలో పీడీలు, పీఈటీలతో సోమవారం ఆటల పోటీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 21 సచివాలయాల ఆటల పోటీలు ముగియడంతో, ఉత్తమ ప్రదర్శన చేసిన వారిని మండల స్థాయికి ఎంపిక చేశారన్నారు. ఈ మేరకు క్రికెట్ 21, వాలీబాల్ 13, కబడ్డీ 13, బ్యాడ్మింటన్ 21, ఖోఖో 2 జట్లు ఎంపికయ్యాయన్నారు. మండల స్థాయిలో సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల, అచ్చంపేట, వేట్లపాలెం, ఉండూరుల్లోని క్రీడా మైదానాల్లో మండల స్థాయి పోటీలు ఈ నెల 23 వరకు జరుగుతాయని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆ పోటీలు 24 నుంచి పెద్దాపురంలో జరుగుతాయని చెప్పారు. ఈ నెల 30 నుంచి కాకినాడ జిల్లా పోటీలు జరుగుతాయన్నారు. అందులో ఎంపికైన వారు ఫిబ్రవరి 5 నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



సామర్లకోట ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ



నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో వేసిన భోగి మంట



ఉప్పాడ ఎంపీపీ పాఠశాలలో జరుగుతున్న ముగ్గుల పోటీ

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

కొత్తపల్లి: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, ఉప్పాడ ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఆయా పాఠశాలల ఆవరణలో భోగి మంట వేయడంతో పాటు బొమ్మల కొలువులను ఏర్పాటు చేశారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతూ విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

ముందుగానే సంక్రాంతి సంబరాలు

సామర్లకోట: సంక్రాంతి సంబరాలు ప్రభుత్వ పాఠశాలల్లో ముందుగానే చేసుకున్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సంక్రాంతి సంబరాలను కోలాహలంగా ఏర్పాటు చేశారు. తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన పెంచేలా రంగవల్లులు, విద్యార్థుల హరిదాసుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన భోగి మంట